# ఏభై సంవత్సరాలు గడిచినా... నూరేళ్లు నిండినా...

"డాడీ! ఈ రోజు మా జువాలజీ మేడమ్ 'ప్లాస్మోడియం' గురించి పాఠం చెబుతూ మలేరియాకు మూలకారణాన్ని డా॥ రోనాల్డ్ రాస్ అనే సైంటిస్టు సికింద్రాబాద్‌లోనే కనుగొన్నాడని చెప్పింది. ఆయన ప్రయోగాలు చేసిన బిల్డింగ్ అక్కడ ఉందట డాడీ!' ఎంతో హుషారుగా అపుడే ఇనిస్టిట్యూట్ నుండి వచ్చిన వాళ్ళనాన్న చంద్రమౌళితో అంది మందిర.

మందిర ఇంటర్‌లో చేరి నెలరోజులు కావస్తుంది. చెప్పిన పాఠాల్ని వెంటది వెంటనే చదువుకుంటుంది. అర్థంకాని విషయాల్ని తండ్రితో అడిగి తెలుసుకొనే అలవాటుచిన్నప్పటినుంచే ఉంది. చంద్రమౌళి సి.యస్.ఐ.ఆర్. కు చెందిన ఇనిస్టిట్యూట్‌లో సైంటిస్టు. ఎక్కువ మటుకు 'కనుగొనడాలు' విదేశాల్లో జరిగి అక్కడి సైంటిస్టుల పేర్లు వనడం అలవాటైన చెవులకు మన దేశంలో అందులో సికింద్రాబాద్‌లో డా. రాస్ ఒక గొప్ప విషయాన్ని కనుగొనడం గురించి జువాలజీ మేడమ్ చెప్పినపుడు మందిర నమ్మలేక నమ్మింది. ఆ తరువాత ఎంతో సంతోషపడింది. తన దగ్గరి బంధువే పెరట్లో గొప్ప పనిచేసినంత సంబరపడిపోయింది.

"అవునమ్మా! చాలా ఏళ్ళక్రితం ఆ బిల్డింగ్‌నుచూసాను. డా.రాస్ మనదేశథంలోనే, ఉత్తర ప్రదేశ్‌లోని అల్మోరాలో జన్మించాడు." కూతురు ఉత్సాహాన్ని ఇట్టే గ్రహించి రెట్టింపు ఉత్సాహంతో మరో సత్యాన్ని తెలిపాడు.

"ఆయన జీవిత చరిత్ర ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. మలేరియా పరిశోధనతో మానవాళికి గొప్పసేవ చేసాడు. ఆయనకు ఈ పనికి నోబుల్ బహుమతి లభించింది. నీకు ఆసక్తి ఉంటే చెప్పమ్మా! మా లైబ్రరీ నుండి ఓ పుస్తకాన్ని తెస్తాను.'' ఊరిస్తూ విషయాన్ని మరింత ఆసక్తిమయం చేసాడు చంద్రమౌళి.

"ఇదంతా వింటుంటే ఆయన జీవిత చరిత్ర ఎపుడెపుడు చదవాలా అని అనిపిస్తుంది డాడీ! వచ్చే ఆదివారం మాత్రం నాకు ఆ బిల్డింగ్‌ని తప్పక చూపాలి. లేకుంటే నేనూరుకోను..." తండ్రి వద్ద ఉన్న చనువుతో గారాభంగా, గోముగా అడిగింది మందిర.

"తప్పక తీసుకెళతానమ్మా!... ప్రామిస్.." అంటూ కూతురు చేతిలో తన చేత్తో మృదువుగా, ఆప్యాయంగా చరిచాడు.

...

ఇంట్లో అందరికీ ఆదివారపు బద్ధకం ఇంకా ఆవరించే ఉంది. మందిరకు మాత్రం ఎపుడెపుడు డా.రాస్ బిల్డింగ్ దగ్గరకు చేరుకుంటానా అన్న ఉత్సాహంతో ఉంది. కూతురి ఉత్సాహాన్ని గమనించి చంద్రమౌళికూడ అదే స్థాయిలో చకచకా రడీ అయ్యాడు. బ్రేక్‌ఫాస్ట్ ముగించి పదకొండు వరకల్లా తండ్రీ-కూతురు స్కూటర్‌పైన బయలుదేరారు.

ఎన్నో సంవత్సరాల క్రితం ఓసారి డా.రాస్ బిల్డింగ్‌ను చూసిన చంద్రమౌళి బేగంపేట ఇపుడు బాగా మరినట్టనిపించింది. కొత్త బిల్డింట్‌లు వెలిసాయి. ఖరీదైన హోటలొకటి హిమాలయ పర్వతంలా నిల్చుంది. అన్ని మార్పులు వచ్చినా, అడిగే అవసరం లేకుండానే ఊహించుకుంటూ, పాత జ్ఞాపకాలను త్రవ్వుకుంటూ చివరగా ఓ పాడుబడ్డ బిల్డింగ్ దగ్గరకు చేరి స్కూటరాపాడు. స్టాండ్‌వేసి తాళం చేయి తీస్తున్నంతలో వెనకనుండి ఎవరో 'ఫ్యామిలీ హోమ్' నుండి బయటకు వస్తూ 'చందూ' అని పిలిచాడు.

"అరె! శ్రీనూ... నువ్వా... వాట్ ఏ సర్‌ప్రైజ్!.. వాట్ ఏ లొకేషన్ టు మీట్!!... " అమితాశ్చర్యం - సంతోషాల మిశ్రమంతో యం.యస్సీలో తన క్లాస్ మేటైన శ్రీనివాస్ వైపు చూస్తూ అన్నాడు.

"మా బంధువు ఈ 'ఫ్యామిలీ హోమ్'లో మెంబర్. దీంట్లోకి వచ్చాం. నీ సంగతి చెప్పు... మనం కలుసుకోక కనీసం ఐదారు సంవత్సరాలు అవుతుంది కదూ? బెంగుళూరు కాన్ఫరెన్సులో కలుసుకున్నాక మళ్ళీ మనం కలుసుకోలేదు....' ' ఉత్సాహంతో మాట్లాడుతున్నాడు శ్రీనివాస్.

సంభాషణలు మొదలయ్యాయి. మందిర ఉనికిని మరిచారిద్దరు. ఆమెకు విసుగు పుడుతుంది. అసౌకర్యంగా మందిర అటూ-ఇటూ కదలడాన్ని గమనించిన చంద్రమౌళి కూతుర్ని శ్రీనివాస్‌కు పరిచయం చేసాడు. మిత్రుని గురించి చెప్పాడు.

మందిర గౌరవంగా నమస్కరించింది.

"ఓ పది నిమిషాలటైమియ్యామ్మా! ఇదేనమ్మా ఆ బిల్డింగ్. నీవోసారి అలా చుట్టూతా తిరిగిరా. అంతలో అంకుల్‌తో మాట్లాడి మళ్ళీ మనిద్దరం తీరిగ్గా చూద్దాం."

మందిర బిల్డింగ్ వైపు చూసింది. ఆ చూపులో ఎన్నో భావాలు ఆశ్చర్యం... విస్మయం...బాధ... నిరాశ....

మానవాళికి మహత్తర జ్ఞానాన్ని అందించిన భవనం.

మనిషి నిర్లక్ష్యతకు ప్రతీకగా ఇంకా నిల్చొని ఉన్న భవనం.

మలేరియా నుండి ముక్తి మార్గానికి పురుడు పోసిన భవనం.

మలేరియా నుండి ముక్తి మార్గానికి పురుడు పోసిన భవనం.

ఇపుడు తన ముక్తికోసం 'కోమా' స్థితిలో ఉన్న భవనం.

మందిర మెల్లగా అడుగులేస్తూ కదులుతుంది. చూపుల్ని బిల్డింగ్‌పైనే ఉంచింది. తన మనస్సులో అనుమానం పీకుతుంది. డాడీఆ చెప్పింది నిజం కాకపోతే బాగుండని ఓ మూలన చిరు ఆశ. నోబుల్ బహుమతి గ్రహీత పరిశోధనలు చేసిన బిల్డింగ్ ఇదేనంటే తనకింకా నమ్మబుద్ధికావడంలేదు. మెల్లమెల్లగా ముందుకు కదులుతూనే ఉంది. ముచ్చట పడుతూ ముందుకు పోతుంది. ఓ కిటికీ లోంచి హాల్లోకి తొంగి చూసింది. ఆర్మీ (సికింద్రాబాద్) వారు గోడలో తాపించిన పాలరాతి ఫలకంపై చెక్కించిన వివరాలు దృష్టిని ఆకర్షించాయి.

మందిర బ్యాగ్‌లోంచి కాగితాన్ని తీసి రాసుకుంది. నిండుగా నూరేళ్ళు కావస్తున్న తరుణం. ఈ బిల్డింగ్ ఆంధ్రాలో ఉండడం, డా.రాస్ ఉత్తర ప్రదేశ్‌లో జన్మించడం మన దేశానికే గర్వకారణమనుకుంది.

మందిర గోడకొరికి కాస్సేపు కళ్ళు మూసు కొంది. తలపులు ఏవో లోకాల్లోకి దారితీసాయి.

"ఏమ్మా?... నీపేరేంటి?.... ఎటొచ్చావ్..."

అతనడిగాడు.

"నాపేరు మందిర... డా.రాస్ గారి ఈ బిల్డింగ్ చూడ్డానికి వచ్చాను... ఇంతకు మీరెవరండీ?..."

"నా పేరు డా. రోనాల్డ్ రాస్..." ముసి ముసిగా నవ్వుతూ మందిర ఎలా ప్రతిస్పందిస్తుందోనని కుతూహలంతో ఆమెవైపు చూస్తూ అన్నాడు.

"మీ....రు... రాస్ గారా?... నేను నమ్మలేకపోతున్నాను...."

మాటలు మెల్లగా, తడబడుతూ వస్తున్నాయి.

"మిమ్మల్ని చూసే భాగ్యం కలగడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను. ఐయామ్ రియల్లీ ప్రౌడాఫ్ మీటింగ్ యూ..." సంభ్రమాశ్చర్యాల తరంగాల్లో డోలలాడుతూ తబ్బిబ్బవుతూ అంది మందిర.

డా.రాస్ ఆమె వైపే చూస్తున్నాడు.

అంతలోనే మందిర ముఖంలో విషాద ఛాయలు చోటుచేసుకున్నాయి. తీవ్రంగా ఆలోచిస్తున్నట్టుంది. మాటలు రావడం లేదు... చివరకు ఎలాగో ధైర్యం తెచ్చుకొంది.

"మా రాష్ట్రం తరపున ముఖ్యంగా జంటనగరాల తరపున మీరు మమ్మల్ని క్షమించమని కోరుతున్నాను. మీ పరిశోధనాలయాన్ని ఇలాంటి హీన స్థితిలో చూస్తున్నందుకు నా మనస్సు పిండి నట్టవుతుంది. మీరెంత బాధపడుతున్నారో నేనూహించగలను. ఉదార హృదయంతో మమ్మల్ని దయచేసి క్షమించండి. డా.రాస్ గారు... ప్లీజ్..." ఎంతో అపాలజిటిగ్గా అంది మందిర.

డా.రాస్ ఒదులివ్వలేదు. శూన్యంలోకి చూస్తున్నాడు. దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టున్నాడు. రెన్నిమిషాల తరువాత కళ్ళనుండి మెల్లగా జారుతున్న కన్నీళ్ళను తుడుచుకున్నాడు.

మందిర డా.రాస్ వైపే చూస్తూ ఉంది. కళ్ళను తుడుచుకోవడం గమనించి దగ్గరగా వెళ్ళి ఆయన రెండు చేతులను ఓదార్పుగా పట్టుకుంది.


డా.రాస్‌కు కొంత తేలిక పడింది.

"ఈ బిల్డింగ్ గురించి వివరించరూ? మీరు ఇక్కడ ఏమేమి చేసేవారో తెలుపరా?..." కాస్సేపట్లో ఏర్పడ్డ చనువుతో ప్రాధేయపూర్వకంగా అడిగింది మందిర.

"చెబుతానమ్మా! తప్పక చెబుతాను... పద...' అంటూ ఇద్దరు ముందుకు సాగారు.

"ఇదేనమ్మా... ఈ గదిలోనమ్మా... నేను నా ప్రయోగాలను జరిపింది..." కిటికీలోంచి ఓ గదిలోకి చూస్తూ అన్నాడు. మందిర తలప్రక్కకు చేతులు నాన్చి కిటికీ అద్దాల్లోంచి గదిలోకి పరీక్షగా చూసింది.

"ఈ గదిలోనే దోమలపై ఎన్నో ప్రయోగాలు చేసాను. మలేరియా పీడితుల రక్తాన్ని పరీక్షించాను... నీకు తెలుసా మందిరా? నా పరిశీలనలను నిర్ధారించటానికి హుసేన్‌ఖాన్ అనే అతను తోడ్పడ్డాడు. దోమ కాట్లకు ఒప్పుకున్నాడు. ఆయన సహకారం కీలకమైనది. చివరకు 1897 వ సంవత్సరంలో ఆగస్టు 20న నా పరిశోధనకు ఫలితం లభించింది. మలేరియాకు మూల కారణాన్ని కనుగొనగలిగాను..." ఉద్వేగంతో, ఉత్సాహంతో డా.రాస్ చెప్పడాన్ని మందిర గ్రహించింది. పరవశంతో ఆయనవైపే చూస్తూ ఉండిపోయింది. ఓక్షణం తానూ డా.రాస్‌లాగే కష్టపడి మానవాళికి ఎంతో సేవ చేయాలన్న




ఉత్తేజాన్ని ల్పితపాటుకాలంలో పొందింది.

డా.రాస్ ముందుకు కదలాడు. అపుడపుడు గోడల్ని స్పృశిస్తున్నాడు. పాత జ్ఞాపకాలతో ముందుకు సాగుతున్నాడు. మందిర ఆయన వెంటే నడుస్తూంది.

వరండా ఫ్లోర్‌పైన దుర్గంధం
చిల్లులుపడ్డ కప్పు సూర్యకిరణాలకు రహదారి
చూరులో జంటపావురాలు
పెచ్చులూడిన గోడలు
గోడల్లోంచి మొలకెత్తిన మొక్కలు
పగిలిన తలుపులు, ఊడిన కిటికీ చువ్వలు
నిర్లక్ష్యతకు నిదర్శనం
ప్రభుత్వాల అంధత్వం

మందిర బిల్డింగ్‌ను క్షుణ్ణంగా చూస్తూ ముందుకు సాగుతోంది. ఒంటరిగా పోతుంది. ఏదో వెలితనిపించి ప్రక్కలకి, వెనక్కి చూస్తే డా.రాస్ కనిపించలేదు. ఆలోచనల్లో పడింది. డా.రాస్ గారితో తాను కలిసి కొన్ని నిమిషాలు గడిపింది నిజమా లేక కలా అన్న సదింగ్ధంలో పడింది... భ్రమ... కాదు... నిజమే... డా.రాస్ తనకు కనిపించాడు. తనతో నడిచాడు. ఎన్నో విషయాలు చెప్పాడు. బిల్డింగ్‌ను చూసి కంటనీరు తెచ్చుకున్నాడు... నిజంకాక ఏమవుతుంది? ఏమో?

మందిర బిల్డింగ్‌ను చసి వచ్చేసరికల్లా చంద్రమౌళి వీడ్కోలుగా శ్రీనివాస్‌తో చేయి కలుపుతున్నాడు. కాస్సేపు చేతులూగాయి. చివరగా చేయి విడిచి మందిర వైపు నడిచాడు.

"పదమ్మా! బిల్డింగ్‌ను చూసొద్దాం రా!..."

"వద్దు డాడీ! మీరు అంకుల్‌తో మాట్లాడుతున్నంతలో నేను చూసి వచ్చాను. మళ్ళీ ఓసారి చూస్తే ఏడుపు వచ్చేట్టుంది డాడీ! మలేరియాకు తారకమంత్రరూపకల్పన జరిగిన ఈ పవిత్ర నిలయాన్ని ఇలాంటి దశలో చూస్తున్నందున సిగ్గుపడుతున్నాను డాడీ. ఓ నోబుల్ బహుమతి గ్రహీత ప్రయోగశాలను మనం ఏవిధంగా గౌరవిస్తున్నామో చూడు డాడీ. ఇంతటి హీనస్థితిలో ఉంచడం మనందరికి తలవంపు. పద డాడీ... ఇక వెళదాం..." ఉత్తేజంతో అంటూ స్కూటర్‌వైపు నడిచింది.

చంద్రమౌళి మందిర మాటల్ని విని నొచ్చుకున్నాడు. కూతురి మృదుత్వానికి గర్వపడ్డాడు. తాను స్కూటర్ వైపు కదిలాడు.

మురికి మూసీనది
దోమలకు పుట్టిళ్ళు
జంటనగరవాసులకు వద్దంటే కాట్లు
ప్రతి కాటుకో చేయి చరుపు
అచ్చంగా చప్పట్ల శబ్దమే అది
రాస్‌కు మన నివాళులే అవి
ఆంధ్రదేశం వర్ధిల్లాలి!
నాయకుల సమాధులు వర్ధిల్లాలి!
జన్మభూమి కార్యక్రమాలు వర్ధిల్లాలి!
రాజకీయ రంగులేని రాస్ బిల్డింగూ వర్ధిల్లాలి!


Ⓟ టి. సంపత్ కుమార్